మహా శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

- సముద్ర స్నానాలకు సిద్ధం చేస్తున్న అప్పికొండ తీరం
- ముస్తాబవుతున్న సోమేశ్వరాలయం
- అధికారుల పర్యవేక్షణలో పనులు



తీరంలో పొక్లెయిన్‌తో చదును చేయిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: మహా శివరాత్రి పర్వదినానికి మండలంలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. తీర్థానికి, సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జీవీఎంసీ అధికారులు అప్పికొండ తీరంలో ఇప్పటికే చర్యలు చేపట్టారు. ఏటా మహా శివరాత్రి నాడు



సోమేశ్వరస్వామి ఆలయం వద్ద శుభ్రం చేసిన దృశ్యం

ఇక్కడ తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్రాంతానికి లక్షలాది మంది భక్తులు వచ్చి ఇక్కడే జాగారం చేస్తారు. మరుసటి రోజు ఉదయం సముద్రంలో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వారికి ఎటువంటి ఇబ్బందులు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు.

జేసీబీతో చదును

ఆలయ పరిసరాలతో పాటు అప్పికొండ తీరాన్ని శుభ్రం చేశారు. ఎక్కడా చెత్తాచెదారం లేకుండా, ఇసుక దిబ్బలను జేసీబీతో చదును చేయించారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించారు.



అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం

ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలను కేటాయించారు. శివరాత్రి మరుసటి రోజు భక్తులు ఇక్కడి సముద్ర తీరంలో స్నానాలు ఆచరించేందుకు అనువుగా తీరంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం ప్రత్యేకంగా స్నానపు గదులు, మొబైల్ టాయిలెట్లు, దుస్తులు మార్చుకునేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. జీవీఎంసీ జోన్‌-6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

నడుపూరు పాఠశాల భేష్

- ఢిల్లీ విద్యాశాఖ బృందం ప్రశంసల జల్లు
- ఇక్కడి కార్యక్రమాలు ఢిల్లీలో అమలు చేస్తామని వెల్లడి

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధన, వాతావరణం చూసి న్యూఢిల్లీ విద్యాశాఖ బృందం ప్రశంసల జల్లు కురిపించింది. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యావిధానాలను అధ్యయనం చేసేందుకు ఢిల్లీ ప్రభుత్వ విద్యాశాఖ ప్రతినిధులు సోమవారం నడుపూరు పాఠశాలను పరిశీలించారు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణల అమలు తీరును పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన వినూత్న, విభిన్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్యూ ఆర్ కోడ్స్, ఆర్ట్ రూమ్‌లో విద్యార్థులు గీసిన చిత్రాలను చూశారు. డ్రాయింగ్ మాస్టర్ నూకరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థుల వివరాలు సేకరించారు. పచ్చదనంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వాటికి సంబంధించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇక్కడి పాఠశాలలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను ఢిల్లీలో అమలు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయిని మాధవి రూపొందించిన బోధనోపకరణాలను, క్యూ ఆర్ కోడ్‌లను



నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో ఢిల్లీ విద్యాశాఖ బృందం

నిశితంగా పరిశీలించారు. విద్యార్థులతో మమేకమయ్యారు. బోధన, బోధనేతర అంశాలపై మాట్లాడారు. బైజూస్ ట్యాబ్ ద్వారా 8250 నిమిషాలు పూర్తి చేసిన సాయి సందేష్‌ను డీఈవో చంద్రకళ అభినందించారు. పాఠశాలలో పెంచుతున్న మియావాకి అడవులను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాలతో పాటు యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి తెలియజేయడం అభినందనీయమని బృంద సమన్వయకర్త, దర్యాగంజ్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిశోర్ అన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వారి వెంట భీమిలి డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాల నాయుడు, మండల విద్యాశాఖాధికారి పైడపునాయుడు ఉన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ వితరణ



అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల కోసం తమ వంతు సాయం అందించడం అభినందనీయమని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధి అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి, ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్ వరలక్ష్మి తన సొంత నిధులతో స్టీల్ సామగ్రిని అందజేశారు. ఆ సామగ్రిని కార్పొరేటర్ చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్‌కు అందజేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సత్య, కొట్యాడ సంతోషి, పైడితల్లి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా గొందేశి



మహేశ్వరరెడ్డి

పెదగంట్యాడ: ఐఎన్‌టీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లిముక్కుకు చెందిన గొందేశి మహేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ ఆలిండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. మహేశ్వరరెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ అభినందించారు.

ఈఎస్‌ఐ ఇన్‌పేషెంట్ సమస్యల పరిష్కారానికి వినతి



ఈఎస్‌ఐ కేంద్ర బోర్డు సభ్యుడు శేఖర్ రాజుతో బీఎంఎస్ నాయకులు

ఉక్కునగరం: ఈఎస్‌ఐ ఇన్‌పేషెంట్ సమస్యలు పరిష్కరించాలని ఈఎస్‌ఐ కేంద్ర బోర్డు సభ్యుడు కె.వి. శేఖర్ రాజును బీఎంఎస్ నాయకులు కోరారు. నగరంలో సోమవారం నిర్వహించిన ఈఎస్‌ఐ జనరల్ పర్పస్ మెడికల్ కేర్ సబ్ సమావేశానికి హాజరైన శేఖర్‌రాజును బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్, మండల కార్యదర్శి నరేంద్ర ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇన్‌పేషెంట్స్‌కు సరైన వైద్యం అందించడం లేదని, మెడికల్ టెస్టులు చేయడం లేదని తెలిపారు. వేరే ఆస్పత్రికి రిఫరల్ కోరితే కేజీహెచ్‌కు లేదా విజయనగరం పంపిస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. షీలానగర్‌లోని 400 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలని, అచ్యుతాపురంలో 100 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించాలని కోరారు. బోర్డు మీటింగ్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శేఖర్ రాజు తెలిపారన్నారు.

ఉత్సాహంగా 'సస్యభారత్'



సస్యభారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: సస్యభారత్ కార్యక్రమాన్ని శ్రీచైతన్య టెక్నో స్కూల్ శ్రీనగర్ క్యాంపస్‌లో విద్యార్థులు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. రైతుల వస్త్రధారణ, వ్యవసాయరంగం ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం, వాటి ఉత్పత్తులవల్ల మానవాళికి లభించే ఉపయోగాలపై వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల వస్త్ర ధారణ, వారు తయారు చేసిన వ్యవసాయ సంబంధిత నమూనాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కామాక్షి, డీన్ అర్జున్, అకడమిక్ కో-ఆర్డినేటర్ వెంకట రమణ, ఇన్‌చార్జి అప్పారావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ విఫలం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు యూనియన్ పూర్తిగా విఫలమైందని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు ఆరోపించారు. ఉక్కు కార్మికుల సమస్యలపై సోమవారం జరిగిన కార్యక్రమంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ఏఐటీయూసీ యాజమాన్యంపై ఎందుకు ప్రత్యక్ష పోరాటం చేయడం లేదని ప్రశ్నించారు. మెరుగైన వేతన ఒప్పందం, ఉత్పత్తికి తగ్గ ఇన్సెంటివ్, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీలు ఏమయ్యాయన్నారు. ఉత్తర కుమారునిలా అనేక ప్రగల్భాలు పలికి, ఎన్నికల్లో గెలిచి యాజమాన్యానికి కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు తాకట్టు పెట్టారన్నారు. యూనియన్ అధ్యక్షుడు కరణం సత్యారావు మాట్లాడుతూ గుర్తింపు యూనియన్ నాయకులు ఎన్‌జేసీఎస్ సభ్యత్వానికి రాజీనామా చేసి, అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని యాజమాన్యంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.కోటేశ్వరరెడ్డి, బి.రమణ, ఎం.ప్రకాశ్ యాదవ్, ఎం.అప్పారావు, చట్టి అప్పారావు, కె. సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూకంప బాధితులకు చేయూత



రిలీఫ్ మెటీరియల్‌తో బయల్దేరిన వాహనం

గాజువాక: టర్కీ, సిరియా భూకంప బాధితులకు వైజాగ్ గాజువాక ఆల్ ముస్లిం ఫెడరేషన్ ప్రతినిధులు తమ వంతు సాయాన్ని అందజేశారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.1.80 లక్షల నగదుతో పాటు రెండు టన్నుల రిలీఫ్ మెటీరియల్‌ను సోమవారం ఢిల్లీ పంపించారు. మెటీరియల్‌తో బయల్దేరిన వాహనాలను స్థానిక అజీమాబాద్ వద్ద ఫెడరేషన్ అధ్యక్షుడు షాహిద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని స్ఫూర్తిగా తీసుకొని తమ వంతుగా కొంత సహాయం చేశామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు ఆయాజ్ అలీ, నశీర్, జాఫర్, ఫరూక్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వం'

కూర్మన్నపాలెం: దేశంలోనే అతిపెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. మహనీయుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 732వ రోజు, సోమవారం ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. ఏళ్లు గడుస్తున్నా, ఉక్కు ఉద్యమాన్ని కొనసాగించడం కార్మికుల పోరాట పటిమకు నిదర్శనమని కొనియాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చెయొద్దని స్పష్టమైన వైఖరి తెలిపిన తెలంగాణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

సీఎం కె.చంద్రశేఖర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు సైతం వారి రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరసాల బాలకృష్ణ, మధు, శ్రీనుప్రకాష్, నాగేశ్వరరావు, ప్రదీప్, సత్యనారాయణ, కృష్ణంరాజు, పాత్రో, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పందుల ఏరివేతకు ప్రత్యేక డ్రైవ్

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, పోర్టు రోడ్డు, పోలీస్‌స్టేషన్ ఏరియాలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను సోమవారం ఏరివేశారు. జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 52 పందులను షూట్ చేశారు. 252 పందులను ఇక్కడి నుంచి తరలించారు. కొద్ది నెలలుగా పెదగంట్యాడ మండలంలోని పలు ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా పందులు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అంతేకాకుండా కాలువల్లో, డంపర్ బిన్ల వద్ద తిష్ట వేస్తున్నాయి. ఇళ్ల ముందు తిరుగుతూ పిల్లలపై దాడులకు దిగుతు



షూట్ చేయడంతో మృతి చెందిన పందులు

న్నాయి. ఈ నేపథ్యంలో ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్ స్పందించారు. పందుల ఏరివేతకు చర్యలు తీసుకున్నారు.

జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

గాజువాక: జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు చెందిన 60 మంది విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సోమవారం నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో పాటు స్వర్ణ, రజత, కాంస్య, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కామాక్షి, డీన్ అర్జున్, అకడమిక్ కో-ఆర్డినేటర్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం నాయకులకు సత్కారం

గాజువాక: గాజువాక శిష్టకరణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు, ప్రతినిధి మణిపాత్రుని సత్యనారాయణను అఖిల భారత శిష్ట కరణ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆ సంఘం డెలిగేట్స్ మీటింగ్‌లో వారిని సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. గాజువాక ప్రాంతంలో శిష్ట కరణ సంఘం అభివృద్ధికి, సామాజికవర్గ ఐక్యతకు తాము చేస్తున్న కృషిని వారు వివరించారు. అనంతరం జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, తెలంగాణ బీసీ కమిషన్ అధ్యక్షుడు వకులాపురం



శిష్ట కరణ సంఘం నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

కృష్ణ మోహన్, శిష్టకరణ సంఘం జాతీయ అధ్యక్షుడు డి.వి.కృష్ణారావు తదితరులు వారిని సత్కరించారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి

గాజువాక: ప్లాస్టిక్ నిషేధంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ కోరారు. ప్లాస్టిక్ నిషేధంపై అక్కిరెడ్డిపాలెంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. ప్రత్యామ్నాయ కవర్లు మార్కెట్‌లో లభిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ వాటిని ఉపయోగించాలని కోరారు. దుకాణదారులు కూడా భూమిలో కలిసిపోయే కవర్లనే ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న లతీష్

శ్రీను, స్థానిక నాయకులు సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకట రమణ, చిట్టిబాబు, నంబారు రాజు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే వారధులు

అగనంపూడి: ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో వలంటీర్లకు సహకరిస్తూ, గృహసారథులు వారధులుగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ 79వ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు అన్నారు. ప్రభుత్వ పథకాలు చిట్టచివరి లబ్ధిదారు వరకు అందేలా చూడాలని కోరారు. వార్డులో నూతనంగా ఎంపిక చేసిన గృహసారథుల సమావేశాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు లంకెలపాలెంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, చేసిన మంచి పనులను వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలకు వివరించాలని సూచించారు. వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులను సమ



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

న్వయపరుచుకుని గృహసారథులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో 79వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సుందరపు అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వై.వెంకటరావు, కాత పార్వతి, కర్రి నరసింగరావు, అప్పారావు, కాత నూకేశ్వరరావు, ఎస్.దేముడు, ఎస్.నరసింగరావు, కె.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో సినీ నటుడు సుమన్ సందడి



నూతన వధూవరులతో సుమన్

పెదగంట్యాడ: సినీ నటుడు సుమన్ సీతానగరంలో సోమవారం సందడి చేశారు. జీవీఎంసీ 75వ వార్డు సీతానగరంలో మసేనమ్మ పండగకు ఆయన హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన ఉత్తరాంధ్ర సర్దార్ గౌతు లచ్చన్న గీత సహ కులాల యువజనం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ సోదరుడు సూర్యప్రకాష్ గౌడ్, అరుణకుమారి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, వానపల్లి ప్రసాదరావు, వెంకటేష్, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంపాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ తరలించాల్సిందే..

కాలనీవాసుల ఆందోళన

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని రామచంద్రనగర్‌ను ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలని రామచంద్రనగర్ గ్రామ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ గేటు వద్ద సోమవారం పలు కాలనీలవాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌లో రోజూ టన్నుల కొద్దీ చెత్తను నిల్వ చేస్తుండడంతో దుర్గంధంతో, దోమలతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. డంపింగ్ యార్డ్‌ను తరలించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా దీనిని తరలించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని



డంపింగ్‌యార్డ్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కాలనీల వాసులు

హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, రామచంద్రనగర్, రిక్షా కాలనీ, గాంధీనగర్, బర్మా కాలనీ, స్వతంత్రనగర్, ఎస్టీ కాలనీ, గోపాలరెడ్డి నగర్, భరత్ నగర్, శీరవానిపాలెం, నడుపూరుకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మల్కాపురం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ దరి ఇందిరానగర్‌కు చెందిన రెడ్డి సత్యనారాయణ ఆదివారం రాత్రి ఇంటి నుంచి సర్వీస్ రోడ్డుపైకి స్కూటీతో వస్తుండగా.. ఒక గుర్తు తెలియని బైకు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కింద పడిపోయిన సత్యనారాయణ కాలుకు గాయమైంది. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- షీలానగర్‌కు చెందిన ద్వారపూడి లీలావతి అనే మహిళ లాయర్ విధులు నిర్వర్తించుకొని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఊర్వశి కూడలి వద్ద ప్రమాదానికి గురయ్యారు. అక్కడ ఆగి ఉన్న కారులోని వ్యక్తి డోర్ ఒక్కసారిగా తెరవడంతో ఆమె కింద పడిపోయి గాయాలపాలయ్యారు. లీలావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలవికాస్ సెంటర్ ప్రారంభం

అగనంపూడి: చిన్ననాటి నుంచి పిల్లలకు క్రమశిక్షణ, ఆధ్యాత్మికత అలవరచడం, పెద్దలను గౌరవించడం, పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, నైతిక విలువలను నేర్పించడం బాలవికాస్ శిక్షణ తరగతుల ప్రధాన ఉద్దేశమని బాలవికాస్ ఇన్‌చార్జి జయశ్రీగణేష్ అన్నారు. అగనంపూడి శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో 6వ బాలవికాస్ సెంటర్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. సమితి కన్వీనర్ జి.రామకృష్ణ మాట్లాడుతూ బాల వికాస్‌లో తర్ఫీదు పొందిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ బాలలు చెడు వ్యసనానికి లోనుకాకుండా ఉండేందుకు, భవిష్యత్తులో మంచి పౌరులుగా తయారయ్యేందుకు బాల వికాస్ శిక్షణ



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న జయశ్రీగణేష్

తరగతులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ నిర్వాహకులు అప్పారావు, విందులు వెంకటరమణ, ఎం.వెంకటరావు, కుమారి వైష్ణవి, ఎ.సాయి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధిలోని భూదేవి చెరువును ఆనుకుని ఉన్న నల్లకొండ అటవీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఇవి వ్యాపించడంతో సమీపంలోని సుమారు 4 ఎకరాల్లో విస్తరించి ఉన్న అకేషియా తోటతో పాటు జీడి, జీడి మామిడి తోటలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఉపసర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు గ్రామస్తులతో కలిసి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలు మరింత వ్యాపిస్తుండడంతో సబ్బవరం అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి గ్రామస్తులు తీవ్రంగా శ్రమంచి మంటలను అదుపుచేసినట్లు తెలిపారు. అయితే చిన్నచిన్న మంట ఇంకా రావడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. మంటలు ఎలా వచ్చాయన్నది తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు.



అయ్యన్నపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న మంటలు

ముందుగా గుర్తిస్తే కుష్ఠు నివారణ సాధ్యమే..

కూర్మన్నపాలెం: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా గొల్లజగ్గరాజుపేట మండల ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి సోకిన వారిపై వివక్ష చూపించవద్దన్నారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యమేనని తెలిపారు. స్పర్శ లేని గోధుమ రంగులో ఉన్న మచ్చలు కుష్ఠు వ్యాధి కావచ్చని, అలా వచ్చిన వెంటనే దగ్గరలోని డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారంగా ఏర్పడి కుష్ఠు వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో స్వామి, ఎంపీహెచ్ఈవో బాబీ, కొండమ్మ, కమల, సీత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కుష్ఠు వ్యాధి నివారణపై ప్రచారం చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు